సాక్షి
నల్లగొండ

బుధవారం । 9 । జూలై । 2025



మూసీపై అన్నదాతల ఆశలు

మూసీ ప్రాజెక్టు కాలువల కింద వరినార్లు పోసుకున్న రైతులు నాట్లకు సమాయత్తమవుతున్నారు. - 8లో



సాగర్‌లో విదేశీయులు

శిక్షణ నిమిత్తం హైదరాబాద్ వచ్చిన 24 దేశాలకు చెందిన 37మంది మంగళ వారం సాగర్‌ను సందర్శించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	531.90 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,72,511 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	4,590 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా : నిల్		
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	3,090 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1500 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్



శ్రీశైలం నుంచి నాలుగు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



సాగర్ జలాశయం

బిరబిరా.. కృష్ణమ్మ

తెరుచుకున్న శ్రీశైలం గేట్లు.. సాగర్‌కు చేరిన కృష్ణవేణి

- 1,72,511 క్యూసెక్కుల నీరు రాక
- వేగంగా పెరుగుతున్న సాగర్ నీటిమట్టం
- ఈ యేడు 21 రోజుల ముందుగానే వరద

నాగార్జునసాగర్: శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువకావడంతో మంగళవారం ప్రాజెక్టు నాలుగు రేడియల్ క్రస్టుగేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గత ఏడాది శ్రీశైలం జలాశయం గేట్లు జులై 29న ఎత్తగా.. ఈసారి 21 రోజుల ముందుగానే ఎత్తారు. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి 2,13,824 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు (215.8070 టీఎంసీలు) కాగా.. 882 (198.8120) అడుగులకు చేరగానే నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే మీదుగా 1,06,792 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు విద్యుదుత్పాదన ద్వారా కూడా నీటి విడుదల జరుగుతోంది. శ్రీశైలం గేట్ల నుంచి విడుదలైన నీరు సాగర్‌కు చేరేందుకు 9 గంటల సమయం పట్టాల్సి ఉండగా.. నదిలో నిండుగా నీరు ఉండడంతో అలలపై పరుగు లీడుతూ త్వరగానే చేరింది. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు). మంగళవారం సాయంత్రానికి 531.90 అడుగులకు (171.8788 టీఎంసీలు) చేరింది. శ్రీశైలం నుండి ఇదే తరహాలో వరద కొనసాగితే రోజుకు 15 టీఎంసీలు వస్తాయి. సాగర్ జలాశయం గరిష్ట స్థాయికి చేరేందుకు మరో 141 టీఎంసీలు అవసరం. 10 రోజుల్లోనే సాగర్ జలాశయం నిండుతుంది.

అప్రమత్తమైన అధికారులు

శ్రీశైలం ప్రాజెక్టు నీటి విడుదలతో సాగర్ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. సాగర్ నీటిమట్టం 546 అడుగులు దాటి స్పిల్‌వేను తాకితే అధికారులు రేయింబవళ్లు విధులు నిర్వహిస్తారు. డ్యాం సర్కిల్ పరిధిలోని ఇంజనీర్లంతా డ్యాం వద్ద విధులలోకి రానున్నారు.

న్యూస్‌రీల్

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా మధుబాబు

నల్లగొండ టూటౌన్ : వరంగల్‌లో పని చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.మధుబాబును పదోన్నతిపై నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు సూర్యాపేట మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న డాక్టర్ జె.సత్యనారాయణను నల్లగొండ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న డాక్టర్ రాజలింగంను జనగాం జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేసింది. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ పి.శ్రవణ్‌కుమార్‌ను సూర్యాపేట జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, సూర్యాపేటలో మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిని వికారాబాద్ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, యాదాద్రి భువనగిరిలోని మెడికల్ కాలేజీలో పని చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ పి.మాలతిని కొడంగల్ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. యాదాద్రి మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేసున్న వెంకటేశ్వర్లును భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, యాదాద్రి జిల్లాలో పనిచేస్తున్న ఈఎన్‌టీ డాక్టర్ శంకర్‌ను ఖమ్మం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

మునుగోడు : పంచాయతీ ఉద్యోగులు విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన మునుగోడు మండలంలోని సొలిపురం గ్రామాని సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మునుగోడులోని బీసీ గురుకులానికి వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి సమ్మెను విజయవంతం చేయాలి




మాట్లాడుతున్న పల్లా వెంకటరెడ్డి

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండలో మంగళవారం మగ్దూం బవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ నెల 15న దేవరకొండలో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్ కుమార్, పబ్బు వీరస్వామి, ఆర్.అంజాచారి, వెంకట రమణ, బంటు వెంకటేశ్వర్లు, నరసింహ, రామచంద్రం, రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, ఉజ్జిని యాదగిరిరావు పాల్గొన్నారు.

మండలానికి 5 తగ్గకుండా

ఎంపీటీసీ స్థానాల పునర్విభజన

- జిల్లాలో 352కు పెరిగిన ఎంపీటీసీలు
- ఎంపీటీసీ స్థానాల పునర్విభజనపై అభ్యంతరాలు స్వీకరణ
- 12న తుది జాబితా ప్రకటన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎంపీటీసీ స్థానాల పునర్విభజన ముసాయిదాను జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లాలో మారనున్న ఎంపీటీసీ స్థానాల ముసాయిదా జాబితాను ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో పెట్టింది. ప్రతి మండలంలో ఐదుకు తగ్గకుండా ఎంపీటీసీ స్థానాలు ఉండేలా ముసాయిదా సిద్ధం చేశారు. దీంతో నల్లగొండ జిల్లాలో ఐదు మండలాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. రెండు కొత్త మండలాల్లో ఐదు చొప్పున ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్పులు

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని మండలాలు పెరగడం, కొన్ని గ్రామాలు, నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు పెరగ్గా, కొన్నింటిని ప్రభుత్వం కుదించింది. దాంతో కొన్ని మండలాల్లో నాలుగు కంటే తక్కువగా ఎంపీటీసీ నియోజక వర్గాలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎంపీటీసీ (మండల ప్రాదేశిక నియోజక వర్గం) పునర్విభజనకు సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రతి మండలంలో ఐదు స్థానాలకు తగ్గకుండా ఉండేలా నియోజక వర్గాల పునర్విభజన చేయాలని పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. దాని ప్రకారం జిల్లాలో మంగళవారం అన్ని మండల పరిషత్‌లలో ఎంపీటీసీ ముసాయిదా జాబితాను ప్రచురించారు.

పెరిగిన మూడు ఎంపీటీసీలు

జిల్లాలో జిల్లాలో 3 ఎంపీటీసీ స్థానాలు పెరుగుతున్నాయి. వాటితో పాటు కొత్తగా 2 మండలాలు కూడా ఏర్పడ్డాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొన్ని మండలాల్లో ఎంపీటీసీ స్థానాలను తొలగించి కొత్త మండలాలకు కలిపారు. మరికొన్నింటిని సర్దుబాటు చేశారు. ఇంకొన్నింటిలో తగ్గించారు. 2019 ఎన్నికల సమయంలో 349 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం 3 పెరిగాయి. దీంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 352కి చేరుకుంది. అత్యధికంగా మిర్యాలగూడలో 19, నార్కట్‌పల్లిలో 15, చింతపల్లి, దామరచర్లలో 14 చొప్పున ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మిగిలిన వాటిలో 12 నుంచి 5 తగ్గకుండా ఎంపీటీసీ స్థానాలున్నాయి.

ఎంపీటీసీ స్థానాల మార్పులు ఇలా..

- జిల్లాలోని చండూరు నుంచి కొత్తగా గట్టుప్పల్ మండలం ఏర్పడింది. చండూరు మండలంలో గతంలో 11 ఎంపీటీసీ స్థానాలుంటే వాటిల్లో 3 ఎంపీటీసీ స్థానాలైన గట్టుప్పల్-1, గట్టుప్పల్-2, తేరట్‌పల్లిని తొలగించి 8 స్థానాలకు పరిమితం చేశారు. ఆ మూడు ఎంపీటీసీలను గట్టుప్పల్ మండలంలో కలిపారు.
- మర్రిగూడ మండలంలో గతంలో 11 ఎంపీటీసీ స్థానాలుండగా అందులో ఒక ఎంపీటీసీ స్థానం అంతంపేటను మర్రిగూడ నుంచి తొలగించి గట్టుప్పల్ మండలంలో కలిపారు.
- మునుగోడు మండలంలోని వెల్మకన్నెను అక్కడి నుంచి తొలగించి, దానిని గట్టుప్పల్‌లో కలిపి ఐదు ఎంపీటీసీ స్థానాలను చేశారు.
- మునుగోడు మండలంనుంచి వెల్మకన్నెను తొలగించిన నేపథ్యంలో అంతకుముందు వెల్మకన్నె పరిధిలో ఉన్న చల్మెడ, పలివెల ఎంపీటీసీ స్థానం పరిధిలోని కోతులారంను కలిపి చల్మెడ ఎంపీటీసీ స్థానంగా మార్చి, గతంలో ఉన్నట్లుగానే 13 స్థానాలకు సర్దుబాటు చేశారు.
- చింతపల్లి మండలంలో 13 ఎంపీటీసీలు ఉండగా ఆ మండలంలో అదనంగా 1 ఎంపీటీసీ స్థానాన్ని పెంచింది. ఆ మండలంలోని గొడకొండ్ల కొత్తగా ఎంపీటీసీగా ఏర్పాటు చేయడంతో అక్కడ ఎంపీటీసీల సంఖ్య 14కు చేరింది.
- పీఏపల్లి మండలంలో గతంలో 14 ఎంపీటీసీ స్థానాలుంటే వాటిని పదికి కుదించారు. 4 ఎంపీటీసీ స్థానాలను గుడిపల్లి మండలంలో కలిపారు. గుడిపల్లిని కూడా కొత్తగా ఎంపీటీసీ నియోజక వర్గం ఏర్పాటు చేశారు.
- ఇంతకుముందు పీఏపల్లి పరిధిలో ఉన్న గుడిపల్లి, పోల్కంపల్లి, భీమనపల్లి, ఘనపురంను గుడిపల్లి ఎంపీటీసీలను మండల పరిధిలోకి తెచ్చారు. అలాగే అంగడిపేట ఎంపీటీసీ పరిధిలో ఉన్న చిల్కమర్రిని ఎంపీటీసీ స్థానంగా చేసి గుడిపల్లి పరిధిలోకి తెచ్చారు.

నేటి వరకు అభ్యంతరాలు స్వీకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి మండలంలో 5 ఎంపీటీసీ స్థానాలకు తగ్గకుండా పునర్వ్యవస్థీకరించి అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా జాబితా ప్రకటించారు. వాటిపై మంగళవారం అభ్యంతరాలను స్వీకరించారు. బుధవారం కూడా స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాలను 10, 11 తేదీల్లో పరిష్కరిస్తారు. ఆ తరువాత అవసరమైన మార్పులు, చేర్పులతో 12వ తేదీన తుది ఎంపీటీసీ నియోజకవర్గాల జాబితాను ప్రకటిస్తారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీకి మించి ఎరువులను అమ్మిన డీలర్లపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 'యూరియా అమ్మకాల నిలిపివేత' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. జిల్లాలో యూరియాతో సహా అన్ని ఎరువులు సరిపోయినంతగా నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రోజూ 9000 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండేలా చూస్తున్నామని తెలిపారు. ఈ నెల 15 నుంచి ఆగస్టు నెలకు అవసరమైన బఫర్ ఎరువులను సిద్ధంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రైవేట్ డీలర్లు ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని, యూరియాకు ఇతర ఎరువులతో లింకు పెట్టవద్దని సూచించారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎరువుల దుకాణాల తనిఖీ

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకే యూరియా విక్రయించాలని, అధిక ధరకు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రవాణా చార్జీల భారం పడుతుందని యూరియా విక్రయాలు బంద్ పెట్టొద్దని సూచించారు. ఈ వానాకాలం సీజన్‌లో 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు 8వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని తెలిపారు. మంగళవారం వరకు 22వేల మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీలు, డీలర్లు, ఎన్‌డీసీఎంఎస్ వద్ద అందుబాటులో ఉందని, 10వేల మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ గోదాములో నిల్వ ఉందన్నారు. వెయ్యి టన్నుల యూరియా కంపెనీ వద్ద నిల్వ చేసుకున్నారని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, జవహర్‌బాబు ఉన్నారు.

జోహార్ వైఎస్సార్



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ కాలనీలోగల వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కాలనీ వాసులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



నల్లగొండలోని మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాంపల్లి : మహిళలు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ భవానితో మాట్లాడారు. గత నెల ఎన్ని కాన్పులు చేశారని కలెక్టర్ ప్రశ్నించగా రెండు కాన్పులు చేసినట్లు భవాని తెలిపారు. రోగులకు ఆరోగ్య విద్యపై నిర్వహించిన అవగాహన సదస్సుకు రోగులు, కుటుంబ సభ్యులు హాజరు కావడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేయించి మొక్కలు నాటించినందుకు సిబ్బందిని అభినందించారు. అంతకుముందు కలెక్టర్ కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్, ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి సిబ్బంది తీసుకురాగా వెంటనే నివేదిక పంపించాలని ఎంపీడీఓ శ్రీనివాసశర్మను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి దరఖాస్తులన్నింటిని ఆగస్టు 14వ తేదీలోగా పరిష్కరించాలని తహసీల్దార్ జి.దేవసింగ్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట చండూర్ ఆర్డీవో శ్రీదేవి, ఎంపీఓ ఝాన్సీ, ఆర్ఐ విజయ పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబరాలు

నాంపల్లి: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నాంపల్లిలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ఎంటర్‌ప్రైజెస్, మార్కెటింగ్‌లపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

హాట్ కేకుల్లా హౌసింగ్ బోర్డు ప్లాట్లు

- నల్లగొండలో చదరపు గజం గరిష్టంగా రూ.28,500
- 21 ప్లాట్ల అమ్మకంతో సుమారు రూ.8.97 కోట్ల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న హౌసింగ్ బోర్డు అధికారులు

నల్లగొండ : నల్లగొండలోని దేవరకొండ రోడ్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని హెచ్ఐజీ, ఎంఐజీ ప్లాట్లు మంచి ధర పలికాయి. మంగళవారం నిర్వహించిన వేలంలో 21 ప్లాట్లు అమ్ముడయ్యాయి. ఈ విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.8,97,48,600 ఆదాయం వచ్చింది. పలు ప్లాట్లను నిర్ణయించిన ఆఫ్‌సెట్ ధర కంటే రెట్టింపు రేటుకు అమ్ముడయ్యాయి. హెచ్ఐజీ, ఎంఐజీకి చెందిన 27 ప్లాట్ల విక్రయానికి హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. చదరపు గజానికి హెచ్ఐజీ ప్లాటుకు రూ.15 వేలు, ఎంఐజీ ప్లాటుకు రూ.13 వేలుగా ఆఫ్ సెట్ ధర నిర్ణయించింది. వేలంలో హెచ్ఐజీ ప్లాట్లు గరిష్టంగా రూ.28,500, ఎంఐజీ ప్లాట్లు రూ.23,500 వరకు ధర పలికాయి. కాలనీలో 4660 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్లను విక్రయించగా, ఒక్కో చదరపు గజానికి సగటున రూ.19,069 ధర పలికినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీపై అనాసక్తి!

- జిల్లాలో 5.60 లక్షల మంది రైతులకు.. 1.80 లక్షల మంది నమోదు
- ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉంటేనే కేంద్ర ప్రభుత్వ పథకాలు
- అవగాహన లేక రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు



నల్లగొండ వ్యవసాయ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

నల్లగొండ అగ్రికల్చర్ : వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ ఏడాది 6వ తేదీన ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 5.60 లక్షల మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు కలిగిన రైతులు ఉండగా.. ఇప్పటి వరకు లక్షా 80 వేల మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. రిజిస్ట్రి ప్రకియ ప్రారంభించి రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు సగం మంది రైతులు కూడా నమోదు చేయించుకోలేదు. ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న రైతులకు ప్రభుత్వం ఒక విశిష్ట సంఖ్య కేటాయించి గుర్తింపు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ గుర్తింపు కార్డులో 11 అంకెల యూనిక్ ఐడీ కేటాయించనున్నారు. భవిష్యత్‌లో ఈ గుర్తింపు కార్డు ద్వారానే రైతులకు పథకాలు వర్తించేలా కేంద్ర ప్రభుత్వం చూడనుంది. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన రైతులకు వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

కేంద్ర పథకాలకు యూనిక్ నంబర్ తప్పనిసరి..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, సాయిల్ హెల్త్‌కార్డు, పసల్ బీమా తదితర పథకాలు వర్తించాలంటే రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలి. భవిష్యత్‌లో ఎరువుల పంపిణీ కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే ఉండనుంది. కొత్తగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు రైతుల ఖాతాలో జమ కావాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పథకాలకే ఫార్మర్ రిజిస్ట్రేషన్ అంటున్నా.. భవిష్యత్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉండాలనే నిబంధన వచ్చే అవకాశం ఉంది.

ఫా ర్మర్ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలు..

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ విధానంతో రైతులకు 11 అంకెల యూనిక్ ఐడీ కార్డు వస్తుంది. దీంతో రైతుల భూముల వివరాలతో పాటు నేల స్వభావం, సర్వే నంబర్లు, సాగు చేస్తున్న పంటల వివరాలు, రైతులకు సంబంధించిన సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వివరాలన్నీ ఆధార్ కార్డుతో అనుసంధానం చేస్తుండటంతో ఒక్క క్లిక్‌తో రైతుల వివరాలు అందుబాటులోకి వస్తాయి. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో రైతుల వివరాలు ఎంటర్ చేయగానే పంటలకు సంబంధించి వివరాలు తెలుస్తాయి. ఈ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం పథకాలు అందేలా చేస్తుంది.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఇలా..

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత ఏఈఓ, ఏఓకు వివరాలు సమర్పించాలి. ఇందుకోసం రైతులు తమ ఆధార్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ ఫోన్‌ను తీసుకెళ్లాలి. రైతుల వివరాలు నమోదు చేసేటప్పుడు ఫోన్‌కు మూడు సార్లు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ చేయగానే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. 11 అంకెలతో కూడిన యూనిక్ ఐడీ కార్డు వస్తుంది.

ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు ఫార్మర్ యూనిక్ ఐడీ కార్డు తప్పనిసరి. రైతులు వెంటనే తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారితో పాటు మండల వ్యవసాయాధికారిని కలిసి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


నరేష్ (ఫైల్)

బీబీనగర్: వ్యవసాయ బావి వద్ద బోరు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువ రైతు మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండలం రావిపహాడ్ తండాలో మంగళవారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రావిపహాడ్ తండాకు చెందిన రైతు బానోతు నరేష్(25) మంగళవారం మధ్యాహ్నం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి బోరు మోటారు ఆన్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మఠంపల్లి: మఠంపల్లి మండల కేంద్రంలోని యాదాద్రి టౌన్‌షిప్‌లో ముళ్ల పొదల్లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మఠంపల్లి ఎస్‌ఐ పి. బాబు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 35ఏళ్లు ఉంటాయని, అతడు మఠంపల్లిలో భిక్షాటన చేస్తుండేవాడని స్థానికుల ద్వారా తెలిసిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. అతడు రెండు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాధవరంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- 11మంది బైండోవర్


ఘర్షణకు పాల్పడిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు

మునగాల: మునగాల మండల పరిధిలోని మాధవరం గ్రామంలో సోమవారం రాత్రి పీర్ల పండుగ సందర్భంగా ముస్లింలలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇరువర్గాలకు చెందిన 11మందిని మంగళవారం మండల తహసీల్దార్ బి. రామకృష్ణారెడ్డి ఎదుట హాజరుపర్చగా వారిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి, యాకూబ్ పాషా, షేక్ చాంద్‌పాషా, షేక్ ఇయ్మాల్, షేక్ నాగుల్‌జానీ, షేక్ సైదా, షేక్ మన్సూర్, షేక్ జానీపాషా, మహ్మద్ అలీ, షేక్ రహీం, షేక్ షఫీ ఉన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

- ఆలేరు పట్టణంలో ఘటన

ఆలేరు: రైలు పట్టాలు దాటుతున్న వృద్ధుడు ప్రమాదవశాత్తు పట్టాలపై కింద పడిపోగా.. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు అతడిని ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం ఆలేరు పట్టణంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని పోచమ్మగుడి ప్రాంతానికి చెందిన లక్ష్మీకాంత్(70) మంగళవారం సాయంత్రం స్థానిక రైల్వే గేట్ సమీపంలోని మెయిన్‌రోడ్డు వద్దకు పని మీద వచ్చాడు. కాసేపటికి ఇంటికి తిరిగి వెళ్తూ రైల్వే గేట్ వద్ద పట్టాలు దాటుతుండగా.. పట్టాల మధ్య పడిపోయాడు. అదే సమయంలో సికింద్రాబాద్ నుంచి కాజీపేట్ వైపు రైలు వేగంగా వస్తోంది. ఇది గమనించిన వృద్ధుడు కేకలు వేయడంతో స్థానికులు కొందరు గమనించి పట్టాల పైనుంచి వృద్ధుడిని పక్కకు తప్పించేందుకు ప్రయత్నించారు. అప్పటికే రైలు సమీపించడంతో స్థానికులు పక్కకు తప్పుకోవడంతో రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న భువనగిరి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అయితే ఇది ఆత్మహత్యా.. లేదా ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు.

మూసీపై అన్నదాతల ఆశలు


నిండుకుండలా మూసీ ప్రాజెక్టు


ఆయకట్టులో రైతులు సిద్ధం చేసిన వరి నారుమళ్లు

- 641.65 అడుగులకు చేరిన ప్రాజెక్టు నీటిమట్టం
- గరిష్ట నీటి మట్టానికి మరో మూడు అడుగుల దూరంలో..
- ఆయకట్టుకు నీటి విడుదల చేయాలని రైతుల విన్నపం

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు కాలువల కింద ఇప్పటికే వరినార్లు పోసుకున్న రైతులు మరో పది రోజుల్లో నాట్లకు సమాయత్తమవుతున్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని మూసీ ఆయకట్టు రైతులు వానాకాలం పంటల సాగుకు నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. మరో వైపు మూసీ ప్రధాన కాల్వల ఆధునీకరణ పనులు పూర్తికాలేదు. ఇప్పటి వరకు ప్రభుత్వం సాగునీటి విడుదలకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేయలేదు. దీంతో మూసీ ఆయకట్టులో ఈ ఏడాది వానాకాలం పంటల సాగుపై ఆయకట్టు రైతుల్లో అయోమయం నెలకొంది.

35వేల ఎకరాల ఆయకట్టు..

మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 645 అడుగులు(4.46 టీఎంసీలు). ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో దాదాపు 35వేల ఎకరాల్లో పంటలు సాగువుతుంది. ప్రధాన కాల్వలకు మోటార్లు వేయడం ద్వారా అనధికారంగా మరో 15వేల ఎకరాలు సాగవుతుంది. యాసంగి పంట సాగు కోసం ఈ ఏడాది ఏప్రిల్ ఐదో తేదీ వరకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేశారు. నీటి విడుదల ముగిసే నాటికి రిజర్వాయర్‌లో నీటిమట్టం 622 అడుగుల కనిష్ట స్థాయికి తగ్గింది. అప్పటి నుంచి వేసవిలో అకాల వర్షాలు, వానాకాలం ప్రారంభంలో తొలకరి వర్షాలతో మూసీ ఎగువ ప్రాంతాలైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వాగుల ద్వారా వరద నీరు మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరింది. అప్పటి నుంచి నిరవధికంగా వస్తున్న ఇన్‌ఫ్లోతో ప్రస్తుతం నీటి మట్టం 641.65(3.60 టీఎంసీలు) అడుగులకు చేరుకుంది. వానాకాలం ప్రారంభంలోనే మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతుల్లో వానాకాలం పంట సాగుపై ఆశలు చిగురించాయి.

కొనసాగుతున్న కాల్వ కట్ట మరమ్మతు పనులు..

మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వకు నీటి విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ వద్ద కాల్వకు ఇరువైపులా లైనింగ్ దెబ్బతింది. దీంతో కాల్వకు నీటి విడుదల చేసిన సమయంలో నీటి ప్రవాహం ధాటికి ఇరువైపులా మట్టి కట్టలు కోతకు గురయ్యాయి. కోతకు గురైన చోట కాల్వకు ఆధునీకరణ పనులను కాంట్రాక్టర్ ఇరవై రోజుల క్రితమే ప్రారంభించారు. ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరం పనులు సాగితే పూర్తికావడానికి మరో వారం రోజుల సమయం పట్టవచ్చు. ఈ పనులు పూర్తయితేనే కాల్వకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు..

వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందుగానే మూసీ ప్రాజెక్టులోకి నీరు చేరడంతో ఈసారి సాగుకు ఎలాగైనా నీరు వస్తుందనే ఉద్దేశంతో రైతులు బోర్లు, బావుల కింద వరినార్లు పోసుకున్నారు. రైతులు మెట్ట దుక్కులు దున్ని వరినాట్లకు పొలాలను సిద్ధ చేశారు. మొదటి విడతలో కాల్వలకు విడుదల చేసిన నీటితోనే దమ్ములు చేసి నాటు వేసేందుకు వీలుగా పొలాలను సిద్ధ చేశారు. కానీ నీటి విడుదలపై అధికారులు ఇంత వరకు షెడ్యూల్ ప్రకటించకపోవడంతో ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ఎప్పుడు ఉంటుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. రాబోయే రెండు నెలలు వర్షాలు కురిసే అవకాశమున్నందున రిజర్వాయర్‌లో అందుబాటులో ఉన్న నీటిని ముందస్తుగానే సాగుకు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటి విడుదలపై ప్రకటన చేయాలి



మూసీ ఆయకట్టు రైతులు వానాకాలం పంటల పైనే ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే వరినార్లు కూడా పోసుకున్నారు. కానీ ఇంతవరకు పెద్ద వానలు పడలేదు. మూసీ ప్రాజెక్టు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటిస్తే అందుకనుగుణంగా రైతులు సాగుకు సిద్ధమయ్యే అవకాశముంది. ముందస్తుగానే కాల్వలకు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కోట లింగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు

ఆదేశాలు రావాల్సి ఉంది

వానాకాలం సీజన్‌లో ముందస్తుగానే కాల్వలకు మూసీ నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కుడి ప్రధాన కాల్వకు చేపట్టిన మరమ్మతులు నాలుగైదు రోజుల్లో పూర్తవుతాయి. దీంతో ఆయకట్టుకు నీటి విడుదలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఈ నెల 17 లేదా 18 తేదీల్లో నీటి విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా ఉన్నతాధిరుల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది. నీటి విడుదలపై తుది నిర్ణయం మాత్రం ప్రభుత్వానిదే.

– చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ, మూసీ ప్రాజెక్టు

సాగర్‌ను సందర్శించిన విదేశీయులు


సాగర్ ప్రధాన డ్యాంపై విదేశీయులు

నాగార్జునసాగర్: భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పర్యావరణ పరిరక్షణ శిక్షణ మరియు పరిశోధన సంస్థలో శిక్షణ పొందుతున్న 24 దేశాలకు చెందిన 37మంది మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. పర్యావరణం, అభివృద్ధి, నీటి సంరక్షణ తదితర అంశాల్లో శిక్షణ పొందుతున్న వీరు సాగర్ జలాశయం, ప్రధాన డ్యాం, జల విద్యుదుత్పాదన కేంద్రాన్ని పరిశీలించారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణం, జలవనరుల వినియోగం తదితర అంశాల గురించి సాగునీటి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సాగునీటి శాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులు, డ్యాం ప్రత్యేక రక్షణ దళం((ఎస్‌పీఎఫ్) ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్ల గొండలోని ఎంజీయూ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో ఎమ్మెస్సీ విద్యార్థుల పరిశోధన పత్రాల సమర్పణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చివరి సెమిస్టర్‌లో విద్యార్థులు చేసిన పరిశోధనలు తమ ఉద్యోగ అవకాశాలను నిర్ణయిస్తాయని గుర్తించాలన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆహార భద్రత విభాగం బాధ్యులు ఎం. సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆహార పదార్థాల్లో ఫంగస్ ఉంటే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తినే ఆహార పదార్థాల్లో నాణ్యత, శుభ్రత పాటించాలన్నారు. అనంతరం 21మంది విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. 13మంది విద్యార్థులు తమ పరిశోధనలకు సంబంధించి పోస్టర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, తిరుమల, అన్నపూర్ణ, మాధురి, మద్దిలేటి, రూప పాల్గొన్నారు.

'భద్రాచలం' ఈఓపై దాడిని ఖండిస్తున్నాం

- ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రమేష్‌బాబు
- యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్ద ఆలయ ఉద్యోగుల నిరసన


యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్ద నిరసన తెలుపుతున్న ఆలయ ఉద్యోగులు

యాదగిరిగుట్ట: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ ఈఓపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజివెల్లి రమేష్‌బాబు అన్నారు. భద్రాచలం ఆలయ ఈఓపై జరిగిన దాడికి నిరసనగా యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్ద మంగళవారం నల్లబ్యాడ్జీలతో యాదగిరిగుట్ట ఆలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీలోని అల్లూరి జిల్లా పురుషోత్తట్నం గ్రామంలో గల భద్రాచలం ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఈఓ రమాదేవి, అర్చకులు, సిబ్బందిపై స్థానికులు దాడి చేయడం బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవలయాల భూములను రక్షించేందుకు ఆలయ ఉద్యోగులు ముందుంటారని, ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఉద్యోగులు గజివెల్లి రఘు, నవీన్‌కుమార్, ముద్దసాని నరేష్, దయానంద్, అర్చకులు పాల్గొన్నారు.

విపత్తు పరిస్థితులపై ఎయిమ్స్‌లో శిక్షణ


క్యూబ్‌ల వినియోగంపై వివరిస్తున్న అధికారి

బీబీనగర్: విపత్తు పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేలా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, విపత్తు నిర్వహణ విభాగం ద్వారా బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలకు అందజేసిన భారత్ హెల్త్ ఇనిషియేటివ్, సహయోగ్ హిత మైత్రి క్యూబ్‌ల వినియోగంపై మంగళవారం 100మందికి శిక్షణ ఇచ్చారు. కేంద్ర విపత్తు నిర్వహణ సెల్ నుంచి రిటైర్డ్ ఎయిర్ వైస్ మార్షల్ డాక్టర్ తన్మోయ్ రాయ్, బృందం క్యూబ్‌ల వినియోగంపై వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంగీత సంపత్, అభిషేక్ ఆరోరా, అగ్నిమాపక అధికారి మధుసూదన్‌రావు, భీష్మ క్యూబ్స్ నోడల్ అధికారి మహేశ్వర్ లక్కిరెడ్డి, అదనపు నోడల్ అధికారి సిద్దార్థ రావు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న వైద్యులు

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీబీనగర్ మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో మంగళవారం ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, బ్లడ్ బ్యాంక్ విభాగం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, నర్సింగ్ అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, విద్యార్థులు 47మంది రక్తదానం చేశారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్, డీన్ నితిన్ అశోక్‌జాన్, వైద్యులు సంగీత సంపత్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులు పరీక్ష ఫీజు చెల్లించాలి

నల్లగొండ : ఛాత్రోపాధ్యాయులు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రధానాచార్యులు కానుగుల నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ) రెండో సంవత్సరం చదువుతున్న 2023–25 బ్యాచ్, ఫెయిలైన, పాత బ్యాచ్‌లైన 2021–23, 2022–24 ఛాత్రోపాధ్యాయులు ఆలస్యరుసుం లేకుండా ఈ నెల 22వ తేదీలోగా చెల్లించాలని పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుంతో 29వ తేదీలోగా పరీక్ష ఫీజులు చెల్లించవచ్చని సూచించారు.


రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తిప్పర్తి: తిప్పర్తి మండలం రాయినిగూడెం–నల్లగొండ రైల్వే స్టేషన్‌ల మధ్య మంగళవారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు నల్లగొండ రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 25 ఏళ్లు ఉంటాయని, చామన ఛాయ రంగు, ఎత్తు 5.4 కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. నీలి రంగు ఫుల్ షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

నిడమనూరు: నకిలీ బంగారం విక్రయించి మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను నిడమనూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మర్రిచెట్టుపాలెం గ్రామానికి చెందిన పోల నందు, అదే జిల్లా లింగసముద్రం మండలం జంపరోరిపాలెం గ్రామానికి చెందిన నాగులూరి ప్రకాశం కలిసి మే నెలలో నిడమనూరు మండలం గుంటకగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన లక్ష్మమ్మకు బంగారం తక్కువ ధరకు విక్రయిస్తున్నామంటూ నమ్మించి ఆమె వద్ద రూ.3.5లక్షలు తీసుకుని నకిలీ బంగారం అంటగట్టారు. లక్ష్మమ్మ బంగారాన్ని నిడమనూరులో దుకాణాదారుడికి చూపించగా అది నకిలీదని తెలియడంతో పోలీసులను ఆశ్రయించింది. దర్యాప్తులో భాగంగా మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు ఆధ్వర్యంలో సీఐ డి. సతీష్‌రెడ్డి, నిడమనూరు ఎస్‌ఐ ఉప్పు సరేష్, నల్లగొండ సీసీఎస్ పోలీసులు జితేందర్, ఎస్‌ఐ విజయ్ నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులకు జిల్లాలో గతంలో కూడా పలు దొంగతనాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక గర్భిణి ఆత్మహత్య


కవిత (ఫైల్)

భువనగిరి: భర్త వేధింపులు భరించలేక ఉరేసుకుని గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం భువనగిరి పట్టణంలో జరిగింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండల కేంద్రానికి చెందిన వంగాల బాబు, నీరటి కవిత(30) 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఎంఎస్సీ పూర్తిచేసిన కవిత భువనగిరి పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించగా.. బాబు ఎలాంటి పనిచేయకుండా ఖాళీగా ఉండేవాడు. ఈ క్రమంలో కవితకు రెండుసార్లు అబార్షన్ సైతం అయ్యింది. దీంతో ఇద్దరు కలిసి కొంతకాలం హైదరాబాద్‌కు వెళ్లారు. బాబు ఓ బ్యాంకులో ఉద్యోగంలో చేరగా.. కవిత ఇంటి వద్దనే ఉండేది. ఈ క్రమంలో కవిత మరోసారి గర్భం దాల్చింది. దీంతో నెల రోజు క్రితం భువనగిరికి తిరిగి వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. బాబు భువనగిరికి బదిలీ అయ్యాడు. ప్రస్తుతం కవిత నాలుగు నెలల గర్భవతి. బాబు వరకట్నం తీసుకురావాలని కవితను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బ్యాంకు వెళ్లిన బాబు తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఎంత పిలిచినా కవిత తలుపులు తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు తెరిచి చూడగా.. అప్పటికే కవిత చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యాదాద్రి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. భర్త వేధించడంతో పాటు అతడే కవితకు ఉరి వేసి హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించడంతో..

తల్లిదండ్రులు మందలించడంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజీపురం గ్రామానికి చెందిన కుక్కల వెంకటేశం కుమారుడు రఘు(21) ఫైనాన్స్‌లో కారు కొన్నాడు. ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు పడుతుండడంతో వేరే ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు రఘును మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రఘు మంగళవారం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం రఘు తల్లిదండ్రులు ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూడగా.. రఘు ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

నెమలి, జింక మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

వేములపల్లి: జాతీయ పక్షి నెమలి, జింక మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని వేములపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ కూలీ పనులతో పాటు చేపలు, కుందేళ్లు, అడవి పందుల వేటకు వెళ్తుంటాడు. అతడు తనకు పరిచయమున్న రాజు అనే వ్యక్తి నుంచి జింక, దుప్పి మాంసాన్ని తీసుకొచ్చి ఇంట్లో అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు మార్చి 23న వేములపల్లి ఎస్‌ఐ అతడి ఇంటిపై దాడి చేయగా పారిపోయాడు. దీంతో రమేష్‌పై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. మంగళవారం రమేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రెండు ఎయిర్ రైఫిల్స్, 3 కత్తులు, 5 అడవి పందుల వేటకు సంబంధించిన వలలు, 15 కుందేళ్ల వేటకు సంబంధించిన ఉచ్చులను స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, వేములపల్లి ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న దొంగ

- పోలీసుల అదుపులో నిందితుడు


స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

నల్లగొండ: బైక్‌లు చోరీ చేస్తున్న దొంగను మంగళవారం అరెస్ట్ చేసినట్లు నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ సైదులు తెలిపారు. నిడమనూరు మండలం బొక్కముంతలపాడ్ గ్రామానికి చెందిన కొండేటి సంతోష్‌కుమార్ మద్యానికి బానిసై బైక్‌లు చోరీ చేస్తున్నాడు. గత నెల 25న గుంటూరు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌వలీ తన బైక్‌ను నల్లగొండ రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ చేయగా చోరీకి గురైంది. బాధితుడు నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉదయం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లు బైపాస్ రోడ్డులో నల్లగొండ టూటౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సంతోష్‌కుమార్, మరో బాలుడు కలిసి దొంగిలించిన బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి హాలియాలో చోరీ చేసిన 2 బైక్‌లు, మిర్యాలగూడ, వాడపల్లి, నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ మరో మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న టూటౌన్ ఎస్‌ఐ సైదులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బైక్ ఢీకొని బాలుడికి గాయాలు

వలిగొండ: బైక్ ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామంలో జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కర్రె గౌతమి, కర్రె హరేంద్ర శనివారం వలిగొండ మండలం టేకుల సోమారంలోని తమ బంధువులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లడానికి టేకులసోమారంలోని బస్టాండ్ వద్ద బస్సు కోసం వేచి చూస్తున్నారు. అదే సమయంలో ఓ వ్యక్తి మోటారు సైకిల్‌పై వచ్చి హరేంద్రను ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మంగళవారం క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

నిండు ప్రాణం ఖరీదు రూ.12లక్షలు!

- ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవానికి వచ్చి మృతిచెందిన గర్భిణి
- మృతురాలి బంధువులతో ఆస్పత్రి యాజమాన్యం సెటిల్‌మెంట్ !

చౌటుప్పల్: ప్రసవం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చి మృతిచెందింది. ఈ విషయం బయటకు రాకుండా అధికార పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి మృతురాలి కుటుంబ సభ్యులు, ఆస్పత్రి నిర్వాహకులతో సెటిల్‌మెంట్ చేసినట్లు తెలుస్తోంది. వివరాలు.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవం కోసం చౌటుప్పల్ పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చేరింది. సోమవారం ఉదయం ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో ఆమె హార్ట్‌బీట్ సరిగా లేదని ఆస్పత్రి నిర్వాహకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌కు తరలించగా.. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు.

రంగంలోకి దిగిన మధ్యవర్తులు

మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు తమ ఆస్పత్రిపై దాడికి పాల్పడే అవకాశాలు ఉన్నాయని భావించిన చౌటుప్పల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన స్థానిక మాజీ ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. ఈ క్రమంలో ఆస్పత్రి వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తు మంగళవారం కూడా కొనసాగింది. బాలింత మృతదేహం హైదరాబాద్ నుంచి ఇక్కడికి వస్తే గొడవ అవుతుందని గ్రహించి మృతదేహాన్ని ఆ మాజీ ప్రజాప్రతినిధి, ఓ పోలీస్ అధికారి హైదరాబాద్‌లోనే ఉంచి అక్కడే బాధిత కుటుంబ సభ్యులతో చర్చించినట్లు సమాచారం. రకరకాల ప్రయత్నాల తర్వాత ఆ కుటుంబానికి ఆస్పత్రి నిర్వాహకులు రూ.12లక్షలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిసింది. ఇవే కాకుండా మరో రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు కూడా అదనంగా ఖర్చు అయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.